లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



లక్ష్మారెడ్డి నామినేషన్‌కు ర్యాలీగా తరలివెళ్తున్న ఆండోజు సత్యంచారి తదితరులు

హస్తినాపురం: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి అన్నారు. బుధవారం రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ వేసే కార్యక్రమానికి హస్తినాపురం నుంచి సత్యంచారి ఆధ్వర్యంలో వందలాదిగా నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సత్యంచారి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులే పార్టీ అభ్యర్థి లక్ష్మారెడ్డిని అధిక మెజారిటీ ఓట్లతో గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, రమావత్ పద్మానాయక్, శ్రీనివాస్‌నాయక్, నల్ల నాగిరెడ్డి, గోదల రఘురెడ్డి, భిక్షపతి చారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు వికలాంగుల యాత్ర



ఎల్‌బీనగర్‌లో శ్రీకాంత్‌చారి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముత్తినేని వీరయ్య

మన్సూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఆ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్, పెరిక కుల కార్పొరేషన్ సాధకుడు ముత్తినేని వీరయ్య ఆధ్వర్యంలో బుధవారం గాంధీ భవన్ నుంచి ప్రారంభమైన విజయ సంకల్ప యాత్ర మధ్యాహ్నం ఎల్‌బీనగర్‌కు చేరుకుంది. ఎల్‌బీనగర్‌లోని తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంత్‌చారి విగ్రహానికి పూల మాల వేసి యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. పెరిక కులస్తులు, వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, కల్లుగీత, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, యావత్ పెన్షన్‌దారుల మద్దతు కాంగ్రెస్ పార్టీకి అందించాలని కోరారు. కార్యక్రమంలో పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి సమన్వయకర్త కోట మల్లికార్జునరావు, పలువురు వికలాంగులు, పెరిక కులస్తులు పాల్గొన్నారు.

కొత్తపేటలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న మురళీధర్‌రావు, యష్పాల్ గౌడ్



వనస్థలిపురంలో శోభాయాత్రలో పాల్గొన్న లక్ష్మీగణపతి దేవస్థానం ప్రతినిధులు

నాగోలు: హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తపేట డివిజన్‌లో మంగళవారం రాత్రి హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ యాత్రను బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. హనుమాన్ యువసేన అధ్యక్షుడు యష్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో కొత్తపేట బాలాజీ నగర్ కాలనీ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర మోహన్ నగర్ చౌరస్తా మీదుగా కమర్షియల్ ట్యాక్స్ కొత్తపేట విలేజ్, ఓల్డ్ మారుతినగర్, జైన్ మందిర్, ఇంద్రానగర్, చైతన్యపురి రామాలయం వరకు కొనసాగింది. బీజేపీ రాష్ట్ర నాయకుడు భరత్ గౌడ్, యువజన సంఘం నాయకులు, కార్పొరేటర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కిరణ్ కుమార్, సాయినాథ్, వినోద్, గొల్లపల్లి స్వామి. అంబాల మల్లేష్, తరుణ్, వరుణ్, సంపత్ ,వెంకటేష్, యశ్వంత్, విష్ణు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో...

వనస్థలిపురం: హనుమజ్జయంతి సందర్భంగా వనస్థలిపురంలోని లక్ష్మీగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హనుమాన్ శోభాయాత్రను కనుల పండువగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలతో వనస్థలిపురం పుర వీధుల్లో యాత్ర కొనసాగింది. ఆలయ కమిటీ చైర్మన్ బి.అశోక్‌కుమార్ గౌడ్, వైస్ చైర్మన్లు మిట్టా రాంమోహన్, కంచి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పంజగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రెడ్డి కుల తత్వం పెరిగి పాకాన పడిందని దాన్ని వెంటనే తొలగించకపోతే రాష్ట్రంలో భవిష్యత్‌లో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ గెలవలేదని అందుకు ఉదాహరణ మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ ఆయన పార్లమెంట్ పరిధిలో ఏడు ఎమ్మెల్యే సీట్లల్లో ఒక్కటి కూడా గెలవలేదని, కేవలం కేసీఆర్ అహంకార పాలనకు వ్యతిరేకంగా ఓటువేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్ర కులంలో రెడ్డిలను మినహాయించి ఏ కులానికి కూడా ఐదు కీలక పదవులు ఇవ్వలేదన్నారు. అన్ని కీలక పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో రెడ్డిలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించడంలో రెడ్డి కులస్తులకన్నా ముస్లింలే ప్రముఖపాత్ర పోషించారని అన్నారు. బీసీలు, మాదిగలే, ముస్లింల సహా అన్ని వర్గాలవారిని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.





మహా హారతిని వెలిగిస్తున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి దంపతులు

హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి లింగోజిగూడ డివిజన్ సాయినగర్ చౌరస్తాలో మహాహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాహారతి కార్యక్రమంలో స్థానిక కాలనీల వాసులు భారీ ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

–లింగోజిగూడ



ఎల్‌బీనగర్ ఓటర్లు @6,04,716

- పురుషులు 3,14,075 మంది
- మహిళలు 2,90,507
- ఇతరులు 134
- యువ ఓటర్లు 11,796
- పోలింగ్ బూత్‌లు: 572

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రస్తుతం 6,04,716 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొంటూ ఎన్నికల అధికారులు తుది జాబితాను ప్రకటించారు. వీరిలో 120 సంవత్సరాలు దాటిన వారు ఇద్దరు ఉన్నారని, వీరిలో ఒకరు పురుషుడు కాగా, మరొకరు మహిళ ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుషుల ఓటర్లు 3,14,075 మంది కాగా, మహిళా ఓటర్లు 2,90,507 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు 134 మంది ఉన్నారు. యువ ఓటర్లు ప్రస్తుతం 11,796 మంది ఉంటే.. దివ్యాంగులు 6,765 మంది ఉన్నారు.85 ఏళ్ల నిండిన వారి సంఖ్య 3,691 మంది, సర్వీస్ ఓటర్లు 61మంది ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 52 మంది మాత్రమే ఉన్నారు. కాగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మొత్తం 572 పోలింగ్ స్టేషన్లను ఏర్పాట్లు చేశారు. ఇక ఈవీఎంలు మాత్రం 713 బ్యాలెట్ యూనిట్స్, 713 కంట్రోల్ యూనిట్స్ కాగా, వీవీపాట్స్ 799 ఉన్నాయి. వీటిని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భద్రపర్చారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 15, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 21, క్యారెట్ 37, దొండ 28, ఆలు 33, ఉల్లి 19, గోకర 35, దోస 15, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 35, మునగ 23, చిలగడదుంప 70, బీట్‌రూట్ 17, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 65. గురువారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేటి నుంచి ఉచిత వేసవి శిబిరం

సైదాబాద్: విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, దేశభక్తి, ఆధ్యాత్మిక విలువలు వంటి అంశాలను కూడా నేర్పించాలని కరుణశ్రీ సేవా సమితి కార్యదర్శి పుష్పాల వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కారుణ్య సింధు ఆశ్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ఆశ్రమంలో ఈ 25 నుంచి మే 9వ తేదీ వరకు విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మన వారసత్వ సంపద, వ్యక్తిత్వ వికాసం అంశాల్లో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈ శిబిరాన్ని గురువారం జిల్లా సంక్షేమశాఖ అధికారి అక్కేశ్వర్‌రావు, వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు నరసింహమూర్తి, శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి చదివే పిల్లలు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



సామ సుందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న భాస్కర్‌రెడ్డి

సైదాబాద్: రాజకీయ ప్రయాణంలో అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారానికే తాము ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని బీఆర్‌ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐఎస్ సదన్ డివిజన్ భానునగర్‌లోని సుందర్‌రెడ్డి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు మెట్టు భాస్కర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయనతో కేక్ కట్ చేయించారు.

పక్కదారి పడుతున్న ఉచిత నీటి ట్యాంకర్లు

సేవాలాల్ బంజారా సంఘం ఆరోపణ



సింగరేణి కాలనీలో మాట్లాడుతున్న మోతీలాల్ నాయక్

సైదాబాద్: సింగరేణి కాలనీ గుడిసెవాసుల కోసం సరఫరా చేయాల్సిన ఉచిత నీటి ట్యాంకర్లు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పక్కదారి పడుతున్నాయని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ ఆరోపించారు. బుధవారం ఆయన సింగరేణి కాలనీలో మాట్లాడుతూ, సింగరేణి కాలనీలోని గుడిసెవాసులకు నల్లా కనెక్షన్లు లేకపోవడంతో నిత్యం జలమండలి సరఫరా చేసే ట్యాంకర్లపైనే నీటి కోసం ఆధారపడుతున్నారని తెలిపారు. 13 ట్యాంకర్లతో రోజూ 100 నుంచి 120 ట్రిప్పులు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, వేసవి కాలం నీటి ఎద్దడిని అనువుగా చేసుకున్న ట్యాంకర్ల యజమానులు ఉచిత ట్యాంకర్లను ఇతరులకు అమ్ముకుంటూ డబ్బు చేసుకుంటున్నారని అన్నారు. అందువల్ల సరిపోను ట్యాంకర్లు రాక గుడిసెవాసులు నీటి కోసం ఇబ్బందిపడుతున్నారన్నారు. వైశాలీనగర్ జలమండలి కార్యాలయం నుంచి సరఫరా అవుతున్న ట్యాంకర్ల విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, లేకుంటే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని మోతీలాల్ నాయక్ హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు సక్రిబాయ్, శాంతిబాయ్, దేవులా నాయక్, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



సహారాస్టేట్స్ కాలనీలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం అంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎంతో ఇష్టమని, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని వాకర్స్‌తో, సహారాస్టేట్స్‌కాలనీలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి ఎలాంటి మెజార్టీ ఇచ్చారో ... ఇప్పుడు కూడా అదే విధంగా మెజార్టీ సునీతామహేందర్‌రెడ్డికి ఇవ్వాలని కోరారు. నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సామ రమణారెడ్డి, కత్తుల రాంబాబు, పుల్లయ్య, క్లెం నర్సింహారెడ్డి, స్వామిగౌడ్, జైపాల్‌రెడ్డి, రామకృష్ణ, బుంగ రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి బీజేపీదే అధికారం

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కేంద్రంలో బీజేపీ అధికారంలో రానున్నదని, ప్రజలు మోదీని ప్రధాన మంత్రిగా మరోసారి చూడాలని కోరుకుంటున్నారని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని డివిజన్ పరిధిలోని సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్, శ్రీపురం కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి కేంద్రంలో బీజేపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, కన్నారెడ్డి, జంగయ్యగౌడ్, నరేందర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట ప్రభుత్వ కళాశాలలో మిశ్రమ ఫలితాలు

ఇంటర్‌లో ఉత్తీర్ణత తగ్గినా మార్కుల్లో ప్రతిభ చాటిన బాలికలు



కె.శ్రావణి ఎంపీసీ 986



సహానా బేగం బైపీసీ 940



సానియా బేగం బైపీసీ 940



ఎం.త్రిష సీఈసీ 880



డి.నవనీత బైపీసీ 776

సైదాబాద్: మలక్‌పేటలోని న్యూ గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో మిశ్రమ ఫలితాలు సాధించారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గినప్పటికీ పలువురు బాలికలు ఆయా విభాగాల్లో మంచి మార్కులతో ప్రతిభ చాటారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో తెలుగు, ఆంగ్లం మాధ్యమాలు కలిపి మొత్తం 239 మంది మొదటి సంవత్సరం విద్యార్థులకు గానూ 10 మంది పరీక్షలకు గైర్హాజర్ అయ్యారు. పరీక్షలు రాసిన 229 మందిలో 83 మంది మాత్రమే పాస్ అయ్యారు. ఉత్తీర్ణతా శాతం 36.24. అదే విధంగా ఆయా విభాగాల్లో రెండు మాధ్యమాలు కలిపి ద్వితీయ సంవత్సరం మొత్తం 203 మందిలో ఇద్దరు పరీక్షలకు గైర్హాజరయ్యారు. 201 మంది పరీక్షలు రాయగా, 50 శాతంతో 100 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. వారిలో ఎంపీసీ ఆంగ్ల మాధ్యమం ద్వితీయ సంవత్సరానికి చెందిన కె.శ్రావణి 1000 మార్కులకు 986 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. సెకండ్ ఇయర్ బైపీసీ ఇంగ్లిష్ మీడియంకు చెందిన సహానా బేగం, సానియా బేగంలు 940 మార్కుల చొప్పున సాధించారు. సెకండ్ ఇయర్ సీఈసీలో ఇంగ్లిష్ మీడియం నుంచి ఎం.త్రిష 880, తెలుగు మీడియం నుంచి జె.సుమలత 855 మార్కులు సాధించారు. బైపీసీ సెకండ్ ఇయర్ తెలుగు మీడియంకు చెందిన డి.నవనీత 776 మార్కులు తెచ్చుకుంది. మొదటి సంవత్సరం ఎంపీసీ ఇంగ్లిష్ మీడియం నుంచి 470 మార్కులకు గానూ జి.సుస్మిత 463 మార్కుల (98.5 శాతం)తో టాపర్‌గా నిలిచింది. సీఈసీలో 500 మార్కులకు ఎండి.తమన్నా 484 మార్కులు సాధించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులను కళాశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మైనార్టీ గురుకుల కాలేజీ విద్యార్థినుల ప్రతిభ



ఇన్నా సుల్తానా 967



ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను అభినందిస్తున్న బాలానగర్ కళాశాల ప్రిన్సిపాల్ వినీల

మన్సూరాబాద్: ఇంటర్ ఫలితాల్లో తెలంగాణ మైనార్టీ గురుకుల కాలేజీ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి గణేష్‌నగర్ కాలనీలోని బార్కాస్ బాలికల కాలేజీలో సీనియర్ ఇంటర్‌లో 72 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 65 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా..56 మంది ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో ఇన్నా సుల్తానా 967 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. నేహా 958 మార్కులు, శ్రావణి 956 మార్కులు సాధించి తరువాత స్థానాలు పొందారు. జూనియర్ ఇంటర్‌లో తారా న్నుమ్ 489మార్కులు సాధించి టాపర్‌గా నిలవగా, కె శ్రీలత 486 మార్కులు సాధించింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను కాలేజీ ప్రిన్సిపాల్ కాజీపురం రాణి అభినందించారు.

బాలానగర్ బాలికల కాలేజీలో..

సూర్యోదయ కాలనీలోని బాలానగర్ బాలికల కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో సాబా 483 మార్కులు సాధించి టాపర్‌గా, సీనియర్ ఇంటర్‌లో ఎం.పూజ 934 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ వినీల అభినందించారు.

బస్తీ యాక్షన్ ప్లాన్‌పై దృష్టి సారించండి



మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్

చాదర్‌ఘాట్: తరచూ చెత్తా చెదారం పేరుకుపోతున్న ప్రాంతాలపై దృష్టి పెట్టి, వాటిని పూర్తిగా తొలగించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ అధికారులకు సూచించారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన ఏఎంహెచ్‌ఓలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లకు ఎర్లీబర్డ్ పథకంతో పాటు బస్తీ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. బస్తీ యాక్షన్ ప్లాన్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో ఏఎంహెచ్‌ఓలు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే బాగుండదని ఆయన హెచ్చరించారు. చెత్త నిల్వలు ఉంటున్న ప్రాంతాలను పూర్తిగా నిర్మూలించే దిశలో ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఎర్లీబర్డ్ పథకానికి ఇంకో వారం రోజులు గడువు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. ఇప్పటికే ఈ పథకానికి మంచి స్పందన వస్తున్నదని, ఈ నెలాఖరుకు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

కేసీఆర్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి



ఎల్‌బీనగర్: బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బుధవారం ఆయన నివాసంలో ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టనున్న బస్సు యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టుపై శిక్షణ ప్రారంభం



పంప్డ్ స్టోరేజీ హైడ్రో ప్రాజెక్టుపై అవగాహన కల్పిస్తున్న ఎంకేపీ సింగ్

మన్సూరాబాద్: పునరుత్పాదక శక్తి వనరుల కోసం పంప్డ్ స్టోరేజీ హైడ్రో ప్రాజెక్టుపై జీఎస్‌ఐ శాస్త్రవేత్తలకు, ఎలక్ట్రికల్ (హైడ్రో) ఇంజినీర్లకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్‌ఐటీఐ)లోని ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ సభ్యుడు (హైడ్రో) ఎంకేపీ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీఎస్‌ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.మాథ్యూజోసెఫ్, డాక్టర్ సాయిబల్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు సంస్థల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ మీదుగా కేసీఆర్ బస్సుయాత్ర



మన్సూరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన పోరుబాట బస్సుయాత్ర బుధవారం మధ్యాహ్నం ఎల్‌బీనగర్ మీదుగా మిర్యాలగూడ, సూర్యాపేటలకు వెళ్లింది. భారీ కాన్వాయ్ మధ్య కేసీఆర్ బస్సు యాత్ర సాగింది.

వీధి దీపాలకు రిపేర్ చేయించండి



తుర్కయంజాల్: సాగర్ రహదారిపై వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఇంజాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, బొక్క వంశీధర్ రెడ్డిలు బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గుర్రంగూడ చౌరస్తా నుంచి ఇంజాపూర్‌కు రోడ్డు మధ్యలో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే వీధి దీపాలకు మరమ్మతు చేయించాలని కమిషనర్ సత్యనారాయణ రెడ్డిని ఆదేశించారు.

తలసేమియా రహిత సమాజాన్ని సాధిద్దాం

సాక్షి, సిటీబ్యూరో: గర్భిణులకు మొదటి త్రైమాసికంలో తప్పనిసరిగా నిర్వహించే హెచ్‌బీఏ2 పరీక్షతో ప్రమాదకర తలసేమియా వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని తలసేమియా-సికిల్ సెల్ సొసైటీ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ మేరీ గోల్డ్ వేదికగా బుధవారం 'తలసేమియా రహిత తెలంగాణ, తలసేమియా నివారణ–ఒ క అడుగు దూరంలో' అనే అంశాలపై దృష్టి సారించే నిరంతర వైద్య విద్య (సీఎమ్‌ఈ) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, విశిష్ట అతిథులు, ప్యానలిస్టులు పాల్గొని తలసేమియా నివారణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడుతూ., తలసేమియాపై నిరంతర వైద్య విద్య (సీఎమ్‌ఈ) అనేది తెలంగాణ నుంచి తలసేమియాను నిర్మూలించడానికి సంస్థ కొనసాగిస్తున్న ప్రత్యేక కార్యక్రమమని పేర్కొన్నారు.

ఫోన్ చూడొద్దన్నందుకు ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



బింగి హర్షిత

కాచిగూడ: ఫోన్ చూడొద్దంటూ తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ హెచ్.నరేష్ సమాచారం మేరకు... తిలక్‌నగర్, ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన శంకర్ కుమార్తె బింగి హర్షిత(17) ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది. హర్షిత తరచూ ఫోన్ చూస్తోంది. దీంతో తండ్రి ఎక్కువదా ఫోన్ చూడొద్దంటూ మందలించాడు. మనస్తాపానికి గురైన హర్షిత ఇంటి నుంచి బయతకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాలు, బంధువులు, మిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన హర్షిత తండ్రి మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.